## మన్నం రెడ్డి వెంకటరెడ్డి

# శీలానికి నిర్వచనం

దరిద్రంలా చీకటి కూడా పేదోళ్ళని పీక్కు తింటూనే వుంటుంది. ఆమె చీకటిని చిందరవందర చేయాలని దీపం ముట్టిస్తే, వెలగడమే ఆలస్యం ఆరిపోయింది. అప్పటికే ఆమెవిసుగెత్తిపోయింది. చికాకు. అసహనం. అయినా, మళ్ళీదీపం వెలిగించ డానికి అగ్గిపెట్టె తీసింది. ఆమె అసహనాన్ని చూసి అది ఓసిగా నవ్వింది. అగ్గిపెట్టెను విసిరి అవతలికి కొట్టింది. ఊపిరి పీల్చుకోబోయింది. విసురులో చేయి చిమ్నీకి తగిలి అది పగిలి పోయింది. గాజుముక్కలు వింతగా చప్పుడు చేశాయి.

చిరాకెక్కువయింది. విసుగు కలిగింది. అస హనం పెరిగింది.

'ఏటీ ఎదవ బతుకులు...' స్వగతంలో గొణు క్కుంది. అన్ని బాధల తాలూకు సారమూ కళ్ళల్లో ప్రతిఫలించి-నీరై పా రి పో యిం ది- చెక్కిళ్ళ మీది నుంచి !

'ఏటో ఈ ఎదవ బతుకులు...' మళ్ళీ గొణు క్కుంది.

'కేర్' మని గుడిసెలోంచి ఏడుపు వినబడింది. బతుకు గురించి గొణుక్కోవడం ఒక్కసారి ఆపే సింది. గబగబా కుక్కిమంచం దగ్గర కెళ్ళింది. ఆదమరచి నిద్రపోతున్న కొడుకును చూసింది తృప్తిగా నిట్టూర్పు విడిచింది. ఒంటిమీద చేయి వేసి చూసింది. ఒక్క క్షణంలో తృప్తి ఆవిరై ఎగిరిపోయింది. గుండెభయంతోదడదడలాడింది- ఒళ్లు చేయికి చురుక్కుమని తగలడంతో ! కంగారు పడింది. ఏం చేయాలో వెంటనే తోచలేదు. పరిస్థితి ఆమెను ఆలోచించనీయడంలేదు. కొడుకును చంక నేసుకుని బయల్దేరింది.

ఎక్కడికి వెళ్ళడం ? అని నిర్ణయం లేకనే బయల్దేరింది. అప్పుడు పట్నం ఒళ్ళు విరుచుకుని ఆవులించేవేళ ! చీకటి గుయ్యారం లాంటి తమ గుడిసెలన్నిటినీ దాటింది.

దాటి—

ఇంకా నడుస్తోంది. వంకరరోడ్డు తగిలింది అయినా నడక ఆపలేదు. ఇంకా యింకా నడవగా మెయిన్‌రోడ్డు-అప్పటికే డిస్పెన్సరీలన్నీ మూసే సేరు. అయినా, పరుగులాంటి నడక సాగుతూనే వుంది. అలా నడిచి నడిచి ఓ చోట ఆగింది. ఆయాసం తీర్చుకోవాలని చేసిన ప్రయత్నం కాదది !

కిటికీలోంచి ట్యూబులైటు కాంతి బయటికి వస్తోంది-లోపల ఉనికిని తెలుపుతూ.

...'డాక్టర్ రాజు ఎంబి బియస్' అన్న ఖరీ దైన డిగ్రీబోర్డు మేకు పీకకు వేల్లాడుతోంది.

ఆమె తలుపు చప్పుడు చేసింది.

అవతలి నుండి జవాబులేదు.

మళ్ళీ తలుపు తట్టింది.

లోపల డాకర్ రాజు చాలా సీరియస్‌గా ఆ రోజు వచ్చినరూపాయలనులెఖ్ఖపెట్టుకుంటున్నాడు. తలుపు చప్పుడు వినిపించుకోలేదు. మళ్ళీ చప్పు డైనావినిపించుకోకపోయేవాడే, కానీ-ఆచప్పుడులో గాజుల శబ్దాన్ని గమనించేడు. లెఖ్ఖలోంచి లేచేడు. డబ్బు సొరుగులో పెట్టేడు. తాళంవేసేడు. తలుపు తీసేడు.

పరుగులాంటి నడకతో, చంకన పిల్లాడిని వేసు కుని రావడాన రొప్పు యింకా తగ్గలేదు. "డాట్రు బాబూ...సంటోడికి వున్నట్టుండి ఒల్లు కాలిపో- తున్నాది...సూడు బాబ్బాబూ...నీకు దణ్ణమెడ తాను..." దీనంగా అందామె.

డాక్టర్ రాజు ఆమె ఎగశ్వాసలకేసి చూసేడు.

"అయితే, యిప్పుడు నన్నేం చేయమంటావ్?" డాక్టరయివుండీ ప్రశ్నించేడు.

"డాట్రుబాబూ...తమరికి తె లం దే వుం ది... తమరి కడుపు సల్లగుంటాది... కాస్తసూడు... మీకు పున్నెముంటాది..."

"ప్చ్...యిప్పుడేం లాభం లేదు..."

"బాబూ...అలాగంటే ఎలాగ బాబూ..."

"ఊహూఁ...యిప్పుడు కాదు..."

"బాబూ..."

"చెప్పేది నీకే..."

"తమరు కనికరించకపోతే సంటోడు సచ్చి పోతాడు బాబూ..."

"రేపు తీసుకురా..."

"బాబూ..." ఏడుస్తూ కాళ్ళమీద పడింది.

ఇరవయేళ్ళయినా నిండని ఆ అమ్మాయికి నాలుగేళ్ళ చంటిబిడ్డా?

ఆ అందాల వక్షాలపై పిల్లవాడి ఆచ్ఛాదనపు బరువా?

ఆ అందమైన ముఖం అంతదీనంగా బ్రతిమి లాడగమా?

"బాగోలేదు- అలా ఆమెచేత బ్రతిమాలించు కోవడం ఏం బాగోలేదు" అనుకుని- "చూడ మ్మాయ్... నీ దగ్గర ఫీజుకి డబ్బుందా?" అన్నాడు.

ఎటూ జవాబు చెప్పక కిమ్మనక వుండి పోయిందామె.

కాళ్ళమీదపడ్డ ఆమెను భుజాలు పట్టుకుని లేపేడు. చంకనున్న పిల్లవాడిని తీసుకున్నాడు. ఆమె వక్షాలకు తగిలిన డాక్టర్ వేళ్ళుపులకించేయి.

"అయితే ఫీజుకి డబ్బు ల్లేవన్న మాట...?"

చీర కొంగు ముడి విప్పుతోంది.

"ఆగాగు... ఎంతది?"

"మూడ్రూపాయలు..."

"మూడా..." చాలా ఆశ్చర్యం నటిస్తూ అన్నాడు.

ఆమె నేలచూపులు చూస్తోంది.

ఆమె గడ్డాన్ని పైకెత్తి "పరవా లేదులే... అన్నాడు.

ఆమె బిత్తరపోయింది. నిశ్చేష్టిత అయింది.

"పరవాలేదు..."

"డాట్రు బాబూ... తమరు...?"

ప్రశ్నార్థకంగా చూసేడు డాక్టర్.

"తమరు పెద్ద సదువులు సదివినోల్లు... పెద్ద కులపోల్లు... బాబ్బాబు... ఆ పని సేయకండి... నానలాటిదాన్నికాను...మీకు పున్నెముంటాది..."

అయినా- డాక్టర్ ఆమెను దగ్గరకు తీసు కున్నాడు.

ఆమె నాగైకెరటమంత పడగవిప్పి పైకి లేచింది. అంతలోనే పిల్లాడిని చూసింది. వాడి మీద పెట్టుకున్న ఆశల్ని తలుచుకుంది. ఆ వెంటనే విరిగిపడింది.

బ్రతుకు ఆశ కొడుకు మీదే పెట్టుకున్న ఆమె- కొడుకు లేకపోతే బ్రతకలేదు. కొడుకు బ్రతకాలి. కొడుకును బ్రతికించుకోవాలి. వాడు బ్రతకాలంటే డాక్టర్‌కి శీలం బలిపెట్టాలి. ఛీ... ఛీ— అనుకునే సమయం కాదు. లేకపోతే కొడుకు దక్కడు. తను కాదంటే కొడుక్కి నూరేళ్ళు నిండుతాయి.

-ఇదీ ఆమె ఆలోచనా సరళి!

డాక్టర్ మొదట ఆశ్చర్యపోయేడు. కొంచెం తటపటాయించాడు. సీరియస్‌గా సిగరెట్ ముట్టించుకుని, మళ్ళీ ఆమెను సమీపించేడు.

ఈమధ్య వ్యవధి ఆమెను ఆలోచించుకోడానికి అవకాశమిచ్చింది.

ప్రతిఘటనలేకుండా డాక్టర్‌కి లొంగిపోయింది.

పిల్లవాడికి వైద్యం చేసినందుకు డబ్బుకు బదులు ఫీజుగా మానాన్ని మారకం చేసుకున్నాడు డాక్టర్ రాజు.

వైద్యం గౌరవనీయ వ్యాపారం!

పిల్లవాడికి ఇంజక్షన్ చేసేడు. తెలుపు, ఎరుపు రంగు కలిగిన కొన్ని మాత్రలు ఆమెకిచ్చేడు. ఎప్పుడెప్పుడు వేసుకోవాల్సిందీ చెప్పేడు.

"చూడమ్మాయ్...రేపు సరిగ్గా ఈ వేళప్పుడే రా...ఎలావుందో చెప్పు..." ఆప్యాయంగా చెప్పేడు. చెపుతూ నవ్వేడు. నవ్వుతూ బుగ్గమీద చిటికె వేసేడు.

అవి చురకల్లా తగిలాయామెకు!

ఆమె పిల్లవాడిని భుజమ్మీదవేసుకుని బరువుగా కదిలింది.

అప్పుడామె–నడుస్తున్న శవంలావుంది!

సర్వస్వం దోచుకుపోయిన ఇల్లులా వుంది!

"జ్వరమెలాగూ తగ్గదు...రేపు రాకుండా పోతుందా...?"

—ఇదీ డాక్టర్ రాజు ఆలోచనాసరళి!!

* * *

చీకటి తెరలను పట్నవాసులు వాలనీయరు. లైటు కాంతులతో ఆ తెరలను కాల్చి వెలుగుల్ని పోతేసుకుంటారు.

సరిగ్గా ఆ వేళప్పుడే ఆమె డిస్పెన్సరీకి వెళ్ళింది. పొడవాటి బెంచీమీద కూర్చుంది. రోగాలతాలూకు




నీరసాలతో జనం బెంచీలమీదే కూలబడి వున్నారు. పిల్లవాడు వున్నట్టుండి ఏడవడం మొదలు పెట్టాడు. ఆమె సముదాయిస్తోంది. కానీ, ఏడుపు ఆగడం లేదు. అలా ఏడుస్తూనే వున్నాడు. ఇక ఆగలేక డాక్టరు వుండే గదిలోకి జొరబడింది. అక్కడ డాక్టర్ ఎవరో రోగిని పరీక్షచేస్తూ దూసుకొచ్చిన ఆమెను చిరాగ్గా చూసేడు.

అంతలోనే, "యిప్పుడెందుకొచ్చేవ్?" అని జవాబుకోసం ఎదురుచూడక "తర్వాత నేను పిలుస్తాను వెళ్ళు..." అన్నాడు నొసలు చిట్లిస్తూ, విసుగు నటిస్తూ!

పరిస్థితిని చెప్పుదామనుకుంది. కానీ, ఆ అవకాశం ఏదీ...?

"ఊఁ...వెళ్ళు..." హూంకారం లాంటి చీదరింపు.

ఏమయితే అయిందనుకుని మొండిగా "డాక్టరు బాబూ...ఉత్త ఉత్తినే గుక్కెట్టి ఏడిసేత్తన్నాడు బాబు...కాస్త సూడు..." అంది దీనంగా.

కానీ, ఆ జాలి పిలుపులూ, దీన ఆర్తనాదాలూ డాక్టర్ని కరిగించలేకపోయాయి.

శరీరాల నుండి ప్రాణాలు పోగా చూస్తుండిన సంఘటనలు ఎన్నెన్నో చూశాడు. ఈ అభ్యర్థన అతనికొక లెఖ్ఖా?

"వాడికి త్వరలోనే తగ్గిపోతుందిగానీ, కొంచెం సేపు ఆగమంటే వినిపించుకోవేం? చెప్పేది నీక్కాదా ఏం?"

మొండితనంగా యింకా వుంటే కోపం పెరుగుతుందని బయటికి వెళ్ళిపోయిందామె!

గంట- రెండు గంటలు- మూడు గంటలు-

కాలం గంటల్లో కరిగి దొర్లిపోతోంది.

పేషెంట్స్ అందరూ వెళ్ళిపోయేర్లు-

బితుకుబితుకుమంటూ పిల్లవాడితో ఆమె-

ఆమెను చూసి 'బోయ్' నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆమె అర్థం చేసుకుంది- తన విషయం ముందే అతనికి చెప్పి వుంచేడని!

తలుపు తెరిచేడు డాక్టర్ రాజు.

ఠిగ్గున తలుపువైపు చూసిందామె.

రమ్మని చేత్తో సంజ్ఞ చేసేడు.

లోపలికి వెళ్ళింది.

"బాబూ... ఈడికి మంచి మందియ్యి బాబూ..." ఆశను అణచుకోలేక అంది.

"ప్చ్...యిస్తాలే... నువ్వెక్కువగా అరవకు. ఇట్రా..." అంటూ దగ్గరికి పిలిచేడు. పిల్లవాడిని ఎంచి వెళ్ళింది.

డాక్టర్ కౌగిలిలో ఆమె గిజగిజలాడుతోంది.

"డాక్టరు బాబూ..."

బులిపిస్తోన్న అనురాగం ఎగిరిపోయింది.

"ఛి...ఛీ...చెప్పేది నీకే...అరవకుండా పడివుండు..."

శవంలా వున్న ఆమెనుండి కావలసింది తీసుకున్నాడు.

తనతో సహకరించడంలేదని ఆమెను ఒక్క తోపుతోసి. "పిల్లాడిని యిలా తే..." అన్నాడు కోపంగా.

ఆశ్చర్యపోయిందామె.

"డాక్టరు బాబూ..." అంది ఆత్రంగా.

"ఊఁ...యిలా తే."

తీసుకెళ్ళింది.

డిస్టిల్ వాటర్‌ను సిరంజిలోకి ఎక్కించేడు.

"మంచి మందియ్యి బాబూ..."

చాలా విసుగ్గా పిల్లాడికి ఇంజక్షన్ చేసేడు.

ఇంజక్షన్ నొప్పికి పిల్లవాడు ఏడ్చేడు.

"ఇక తీసుకెళ్ళు..." అన్నాడు కోపంగా.

ఇంజక్షన్ చేసినచోట దూదితో రుద్దుతూ బయిటికి దారి తీసిందామె!

* * *

వారం రోజులు యిలా గడిచింతర్వాత—

ఆ రోజూ మామూలుగానే డిస్పెన్సరీకి వెళ్ళింది పొడవాటి బెంచీమీద కూర్చుంది. పేషెంట్స్ ఖాళీ అయ్యేరు. 'బోయ్'కూడా మామూలుగా నవ్వుకుని వెళ్ళిపోయేడు. ఆ తతంగమంతా అయింతర్వాతగానీ, ఆమె డాక్టర్‌ను కలుసుకో ప్రయత్నం చేయలేదు.

డాక్టర్ తలుపు తోసుకుని తొంగిచూసేడు.

ఆమె !

రమ్మని చేత్తో సంజ్ఞ చేసేడు.

చేతనత్వాన్ని కోల్పోయి వెళ్ళి డాక్టర్ ముందు నిలబడింది. పిల్లవాడు చంకన లేకపోవడంతో డాక్టర్ క్షణకాలం ఆశ్చర్యపోయాడు.

"తగ్గినట్టే కదా..." అని మామూలుగానే దగ్గరికి చేరబోయేడు.

కన్నీటితో నిండినకళ్ళు కరిగిపోయేయి. దగ్గరికి చేరడంతో కళ్ళు కొలిమిలోంచి తీసిన యినుపగోళీల్లా అయ్యేయి.

—ఎన్నెన్ని బ్రహ్మండ భాండాలను పిడికెడు గుండెలో దాచుకుందో... ఎన్నెన్ని బాధలనూ, గాధలనూ గొంతులో దిగమింగుకుని సమాధి చేసుకుందో... ఎన్నెన్ని ఆకళ్ళని ఆ కడుపులో పూడ్చి పెట్టి కడుపును నిలుపుకుందో-

అంత బాధపడి నిలుపుకున్న కడుపు పంటకి ఈరోజు చితి రగులుతోంటే అందుకు కారకుడైన డాక్టర్ నిలపాల్సిన ప్రాణాన్ని నిట్టనిలువునా తీసినందుకు- చెయ్యి వెయ్యడంతోనే సెగలెత్తి రగిలి పోయిందామె!

కళ్ళు నిప్పుల ముద్దలయ్యేయి.

పిడికిళ్ళు బిగుసుకు సుత్తులయ్యేయి.

చేతులకు అతుక్కుపోయిన గాజులు పిడికిళ్ళ బిగియడంచేత పగిలి ముక్కలయ్యేయి.

శరీరంలోంచి పొంగి పొరలేలా రక్తపు హోరు...ఉద్రేకం...

డాక్టర్ దగ్గరవుతున్నాడు—యింకా.

'పీణదానం సేయాల్సిన డాక్టరు మానం ఎక్కనాక్కుంటాడా? ఆదీకాక, సంటోడి జబ్బు నయం సెయ్యక వారం రోసుల్నుంచీ ఒంట్లోని ఆడిరోగానికి, ఈడి ఒంటి సుకానికి జతకడతాడా? ఆడి సదువు ఆడ్ని ఎత్తికెల్ల...ఆడిబుగ్గి బూమ్మీద నేకుంటాపోనూ...' లోలోపల గుండెలవిసే దుఃఖంతో ఆమె గిజగిజలాడిపోతోంది.

అయినా, డాక్టర్ ఆగలేదు. ఇన్నాళ్లూ తనకు లొంగి ఈరోజు యిలా ఎదురు తిరగడం సహించలేకపోయేడు. కోపం హెచ్చింది. ఉద్రేకపు స్థాయి ఓ మెట్టు పెరిగింది.

ఇంకా దగ్గరకు చేరేడు డాక్టర్ రాజు.

ఆవేశంతో, ఆసహనంతోవున్న ఆమె పక్షాలు గుండెమీద ఆగడంలేదు.

అంతే !

ఒంటిలోని శక్తిని చేతుల్లోకి రానిచ్చింది. డాక్టర్ రాజు కంఠాన్ని ఉరితాడుగా బిగించింది.

ఊహించని పరిణామానికి అచలితుడయ్యేడు. ఆ పట్టునుండి విడిపించుకుందామని ఎంత ప్రయత్నించినా...ప్చ్...ఫలితం లేకపోతోంది.

డాక్టర్ రాజు గింజుకుంటున్నాడు.

ఉక్కిరి బిక్కిరయ్యేడు.

ఏడుస్తూనే కంఠాన్ని బిగదీస్తోందామె !

డాక్టర్ రాజు తల ఆమె చేతులమీద వాలిపోయింది. వదిలేసింది.

కుప్పలా ఆమె కాళ్ళమీద పడిపోయేడు డాక్టర్ రాజు శవమై.

ఆమె చూపులు శూన్యంలోంచి తెగి, కళ్ళ ముందు-కాళ్ళ ముందు కుప్పయి వున్న శవాన్ని చూశాయి.

కాళ్ళల్లో వణుకు.

కళ్ళల్లో బెదురు.

గుండెలో అదురు.

—ఆమె నావహించేయి !

గబగబా తలుపు తీసి, గాల్లోకి పరిగెట్టింది.

* * *

తుని చేరిందామె!

అక్కడా, యిక్కడా పనిచేసుకుంటూ తునిలోనే వుంటోంది. అలా రోజులు దొర్లించేస్తోంది.

మూడు నెలల తరువాత-

డాక్టర్ రాజు ఆమె కడుపులో కదలసాగేడు. అప్పటికి ఆమె భర్తపోయి రెండు సంవత్సరాలవుతోంది!

వాళ్ళూ వీళ్ళూ ఆమెకు నెల తప్పిందని ముక్కుమీద వేలేసుకుని చాటుగానూ, వినిపించేటట్టూ నానా మాటలూ అన్నా వాటిని లెఖ్ఖ చేయలేదామె!

లోకులకు భయపడి కడుపులో మెదిలే పిండానికి కీడు చేయలేదు.

మాతృత్వం కోసం భయపడి కడుపు కాపాడుకుని ఆడమనసును చాటుకుంది.

ఆమె పేరు సుశీల!

నిజంగా ఆమె 'సు-శీలే'!

*